సాక్షి

పార్వతీపురం మన్యం

మంగళవారం । 3 । జూన్ । 2025



పెరుగుతున్న మడ్డువలస నీటిమట్టం

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు నీటిమట్టం పెరుగుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి ప్రాజెక్టులోకి వచ్చే నీటి ప్రవాహం పెరిగింది. సుమారు వెయ్యి క్యూసెక్కుల నీరు వచ్చి చేరడంతో 64.05 మీటర్ల మేర నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు వెల్లడించారు.



ప్రజల సమస్యలను పరిష్కరించాలి

ప్రజా వినతుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందిన వినతులకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. - IIలో



అల్లంత దూరాన..! - IIలో

సాలూరు మండలంలోని దిగువ మెండంగి డిపోలో రేషన్ సరుకుల కోసం డొంకల వెలగవలస, పనసలవలస తదితర గ్రామాల ప్రజలు సోమవారం ఆటోలో వచ్చి సరుకులు తీసుకున్నారు.

న్యూస్‌రీల్

తోటపల్లి నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

పార్వతీపురం టౌన్: తోటపల్లి బ్యారేజీ నిర్వాసిత గ్రామమైన పిన్నింటి రామినాయుడువలస గ్రామ సమస్యలు పరిష్కరించాలని తోటపల్లి నిర్వాసితుల సంఘం జిల్లా కన్వీనర్ బంటు దాసు డిమాండ్ చేశారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద ఇళ్ల నిర్మాణ బిల్లులు చెల్లించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. గతేడాది ఏప్రిల్ 28న, ఈ ఏడాది మే 12న నిర్వాసిత గ్రామ ప్రజల సమస్యలను విన్నవించినా ఒక్కటీ పరిష్కరించకపోవడం విచారకరమన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

తులసిరామినాయుడువలసలో ఏనుగుల గుంపు

గరుగుబిల్లి: మండలంలోని తులసిరామినాయుడువలస గ్రామ సమీపంలో ఏనుగులు సోమవారం సంచరించాయి. వారం రోజులుగా నందివానివలస, సుంకి, సంతోషపురం, గొట్టివలస, తదితర గ్రామాల్లో ఏనుగులు సంచరిస్తూ పంటలకు నాశనం చేస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో పొలాలకు వెళ్లేందుకు రైతులు భయపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఏనుగులు తరలించాలని కోరుతున్నారు.

పార్వతీపురం ఎమ్మెల్యేపై మహిళ ఫిర్యాదు

- అసభ్యకర మాటలతో మానసిక క్షోభకు గురి చేశారని ఆవేదన

సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురం రూరల్: పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తనతోపాటు, ఇద్దరు మహిళలను కించపరిచేలా, సభ్య సమాజం తల దించుకునేలా జుగుప్సాకరమైన వ్యాఖ్యలను పత్రికా ముఖంగా చేశారని నియోజకవర్గంలోని పెదబొండపల్లికి చెందిన చుక్క శ్రీదేవమ్మ గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం విజయనగరంలో నివాసం ఉంటున్నానని.. గతంలో తాను వ్యాపారం నిమిత్తం స్వగ్రామంలో ఏర్పాటు చేసుకున్న పరిశ్రమలను, తోటలను ఎమ్మెల్యే విజయచంద్ర ధ్వంసం చేశారని.. నివాస గృహాన్ని సైతం జేసీబీలతో కూల్చి వేశారని.. దీనిపై తాను న్యాయ పోరాటం చేస్తున్నానని ఆమె వివరించారు. ఏడాది కాలంలో తనతోపాటు.. మరో ఇద్దరు మహిళలను ఎమ్మెల్యే విజయచంద్ర వేధించారని గత నెల 19న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు మీడియా సమావేశంలో ప్రస్తావించారని తెలిపారు. దీనిపై మరుసటి రోజు పార్వతీపురం శాసన సభ్యుడు విజయ చంద్ర మీడియా సమావేశం పెట్టి.. మహిళలని కూడా చూడకుండా అభ్యంతరకర వ్యాఖ్యలు తమపై చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలు తనను తీవ్రంగా బాధించాయని, మానసిక వేదన కలిగించాయని వాపోయారు. తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో ఆమె పేర్కొన్నట్లు తెలిసింది. ఇదే విషయమై శ్రీదేవమ్మ వద్ద ప్రస్తావించగా.. ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండిస్తూ తాను ఫిర్యాదు అందజేసినట్లు స్పష్టం చేశారు.

రేషన్ డిపోలపై పచ్చ పెత్తనం!

- మహిళా సంఘం నుంచి డీఆర్ డిపోను బలవంతంగా స్వాధీనం చేసుకున్న 'తమ్ముడు'
- నిబంధనల ప్రకారం మరో సంఘానికి వెళ్లాలంటున్న మహిళలు



డిపో విషయంలో జరిగిన అన్యాయాన్ని వివరిస్తున్న మహిళలు

సాక్షి, పార్వతీపురం మన్యం: కూటమి పాలనలో 'తమ్ముళ్ల' బరితెగింపునకు నిదర్శనమీ ఉదంతం. ఇప్పటికే పలుచోట్ల రేషన్ డిపోలను పప్పూబెల్లాల్లా పంచుకున్న కూటమి నాయకులు.. డీలర్ల నియామకాల్లోనూ తమ మాటే చెల్లుబాటయ్యేలా చేసుకున్నారు. చివరికి మహిళా సంఘాల ఉపాధి కోసం కేటాయించిన మినీ డీఆర్ డిపో (సబ్ డిపో)లనూ వదలడం లేదు. బలవంతంగా తాళాలు విరగ్గొట్టి మరీ కురుపాం నియోజకవర్గంలో ఒక డిపోను స్వాధీనం చేసుకోవడం గమనార్హం. గుమ్మలక్ష్మీపురం మండలం రాయగడజమ్ము పంచాయతీ పెంగువ గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో చాలా ఏళ్లుగా మినీ డీఆర్ డిపో నడుస్తోంది. మహిళా సంఘాల సభ్యులంతా ఏకాభిప్రాయంతో నాలుగేళ్లకోసారి ఒక్కొక్కరూ నిర్వహణ బాధ్యతలు చూసుకునేలా ఒప్పందం చేసుకుని, ఆ ప్రకారం అమలు చేస్తున్నారు. 2013 నుంచి 2019 వరకు సోనియా సంఘానికి చెందిన జ్యోతి అనే మహిళ ఈ డిపో నడిపేవారు. ఈమె స్థానిక టీడీపీ నాయకుడు దాసు భార్య. అప్పట్లో ఏడేళ్లకుపైగా డిపోను స్వాధీనం చేసుకున్నారు. 2019 నుంచి ఒప్పందం ప్రకారం సరస్వతి గ్రూపు ఆ బాధ్యతలు తీసుకుంది. అప్పట్లోనే సదరు టీడీపీ నేత నుంచి ఒత్తిడి వచ్చినా సభ్యులంతా ఏకాభిప్రాయంతో సరస్వతి గ్రూపునకే అప్పగించారు. ఇప్పుడు మరలా డిపోను స్వాధీనం చేసుకునేందుకు టీడీపీ నేత అధికారులపై ఒత్తిడి చేశారు. నిబంధనల ప్రకారం ఒకసారి చేసిన వారు మరలా చేయకూడదని.. అందరి ఆమోదం మేరకు ఈసారి సీతాదేవి గ్రూపునకే డిపో అప్పగించాలని మిగిలిన సభ్యులంతా ఖరాకండీగా చెప్పేశారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన టీడీపీ నేత దాసు.. తన అనుచరులతో కలసి వెళ్లి ఈ నెల ఒకటో తేదీన డిపో తాళాలు విరగ్గొట్టి, స్వాధీనం చేసుకున్నాడు. దీంతో బాధిత సభ్యులంతా సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుని పీజీఆర్ఎస్‌లో తమ గోడు చెప్పుకొన్నారు. ఐటీడీఏ పీవో అశుతోశ్ వద్ద జరిగిన అన్యాయాన్ని మొరపెట్టుకున్నారు. సీతాదేవి గ్రూపునకే ఈసారి డిపో ఇవ్వాలని తామంతా తీర్మానం కూడా చేసి పంపిన విషయాన్ని పి.అమల, లలిత, కమల కుమారి, సుజాత, సుధారాణి, లక్ష్మి, జానకి, సామి, ఉష, వసంతకుమారి, అనిత, సింధు తదితరులు వివరించారు.




సభ్యుల అనుమతి లేకుండా స్వాధీనం చేసుకున్న డిపో ఇదే..

ఎనిమిది గ్రామాలకు ఈ డిపోనే ఆధారం..

పంచాయతీ పరిధిలోని ఎనిమిది గ్రామాలకు ఇక్కడ డిపోనే ఆధారం. సుమారు 590 వరకు కార్డులున్నాయి. ప్రతిసారీ ఒక్కరే నిర్వహిస్తామంటే ఎలా కుదురుతుందని పలు సంఘాల సభ్యులు ప్రశ్నిస్తున్నారు. మరలా సోనియా సంఘానికి చెందిన జ్యోతికే డిపో అప్పగించాలని ఒత్తిడి చేస్తున్నారని, దీన్ని తామంతా నిలదీస్తే దిక్కున్నచోట చెప్పుకోండని బెదిరిస్తున్నట్లు వాపోయారు. తహసీల్దారు ఆదేశాలతో.. వీఆర్వో సమక్షంలోనే టీడీపీ నేతలు తాళాలు పగలగొట్టి, దౌర్జన్యంగా డిపోను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.

సీతంపేట: పెదరామ డిపో వద్ద సర్వర్ పనిచేయక సరుకుల కోసం నిరీక్షిస్తున్న గిరిజనులు



ఏజెన్సీలో రేషన్ కష్టాలు

భామిని/సీతంపేట: ఏజెన్సీ ప్రజలకు రేషన్ కష్టాలు ఆరంభమయ్యాయి. ఐదేళ్లపాటు నిశ్చింతగా ఇంటివద్దనే రేషన్ సరుకులు తీసుకున్న ప్రజలు.. ఇప్పుడు పనులు మానుకుని, కొండలు దిగి రేషన్ సరుకుల కోసం పరుగు తీయాల్సి వస్తోంది. ఎండీయూ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దుచేయడంతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. బియ్యం మూటలను కిలోమీటర్ల దూరం మోసుకుంటూ వెళ్లాల్సివస్తోంది. మరికొన్ని చోట్ల సర్వర్ డౌన్‌తో సరుకులు అందక గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. నిరాసతో వెనుదిరిగారు. మంచి చేస్తుందనుకుని ఓటేస్తే... పేదలను కష్టాలపాలు చేసిందంటూ కూటమి ప్రభుత్వ తీరును దుమ్మెత్తి పోస్తున్నారు.



భామిని: బత్తిలి రేషన్ డిపో నుంచి బియ్యం మోసుకుంటూ వెళ్తున్న మహిళలు



సీతంపేట: రేషన్ అందక కుశిమిలో చెట్ల కింద వేచి ఉన్న లబ్ధిదారులు

సిరిమానోత్సవానికి వేళాయె..

- నేడు ముగ్గురు అమ్మవార్ల సిరిమానోత్సవం
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- ఘనంగా తొలేళ్ల ఉత్సవం



అమ్మవార్లను పసుపు, కుంకుమ సమర్పిస్తున్న భక్తులు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం గ్రామదేవతలు ఇప్పల పోలమ్మ, ఎర్ర కంచెమ్మ, బంగారమ్మ అమ్మవార్ల ఉత్సవాలు చివరి ఘట్టానికి చేరుకున్నాయి. మంగళవారం సాయంత్రం నేత్రపర్వంగా జరగనున్న సిరిమానోత్సవానికి సర్వం సిద్ధమైంది. సుమారు రెండు లక్షల మంది భక్తులు ఉత్సవంలో పాల్గొనవచ్చని పోలీస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆ మేరకు 450 మంది పోలీసులను బందోబస్తు విధులకు నియమించారు.

భక్తిశ్రద్ధలతో తొలేళ్ల ఉత్సవం

అమ్మవారి సిరిమానోత్సవానికి ముందురోజు సోమవారం నిర్వహించిన తొలేళ్ల ఉత్సవాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో జరిపారు. పట్టణానికి చెందిన రైతులు విత్తనాలను అమ్మవారి వద్దకు తీసుకురాగా, ముత్యాల ఘటాన్ని తెచ్చిన తర్వాత అమ్మవారి ఆలయ ప్రాంగణంలో తొలేరు ఉత్సవం నిర్వహించారు. అమ్మవారి వద్ద విత్తనాలను ఉంచి పూజ చేశారు. అనంతరం రైతులకు విత్తనాలు అందజేశారు. వీటిని ఖరీఫ్‌లో జల్లే విత్తనాల్లో కలిపి సేద్యం చేస్తే పంటలు కలిసివస్తాయన్నది రైతుల నమ్మకం.

5 గంటలకు సిరిమానోత్సవం ప్రారంభం

సిరిమానోత్సవం మంగళవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభమవుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. సిరమాను తిరిగే ప్రధాన రహదారితో పాటు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలు అమల్లో ఉంటాయన్నారు. స్థానిక బాబూ జగ్జీవన్‌రామ్ కూడలి నుంచి పాత బస్టాండ్, రాయిగడ కూడలి వరకు రాకపోకలు పూర్తిగా నిలిపివేస్తామన్నారు.

రాకపోకలు ఇలా..

సిరిమానోత్సవ సమయంలో కృష్ణపల్లి గ్రామానికి వెళ్లాల్సిన వారు ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా బైపాస్ రోడ్డు, సౌందర్య థియేటర్ రోడ్డులో వెళ్లాల్సి ఉంటుందని పోలీస్ అధికారులు తెలిపారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు లారీ, ఆటో తదితర వాహన యూనియన్లు సహకరించాలని కోరారు. సమస్యలు వస్తే తక్షణమే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

అన్ని వర్గాలకూ చంద్రబాబు వెన్నుపోటు

- హామీలిచ్చి మోసగించారు..
- మాట్లాడితే కేసు.. అరెస్టుల ఆంధ్రాగా మార్చారు
- ప్రజలకు మంచి జరగాలనే మా పోరాటం
- ఈ నెల 4న 'వెన్నుపోటు దినం'ను విజయవంతం చేయాలి
- మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు రాజన్నదొర



'వెన్నుపోటు దినం' వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాజన్నదొర, వైఎస్సార్‌సీపీ నాయకులు

సాక్షి, పార్వతీపురం మన్యం/సాలూరు :

అన్ని వర్గాల ప్రజలకూ కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు పీడిక రాజన్నదొర అన్నారు. గత ఎన్నికలకు ముందు చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌లు అమలుకాని హామీలిచ్చి, అరచేతిలో వైకుంఠం చూపారని.. నమ్మి ఓటేసిన పాపానికి ప్రజలను నిలువునా మోసగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి పాలనలో దగా పడిన అన్ని వర్గాల వారికీ అండగా నిలవాలన్న ఉద్దేశంతోనే వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 4న జిల్లాలో వెన్నుపోటు దినం నిరసన ర్యాలీలు చేపడుతున్నట్లు చెప్పారు. సోమవారం సాలూరులో విలేకరులతో ఆయన మాట్లాడారు. తొలుత కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు.

అసెంబ్లీ సాక్షిగా మంత్రి అబద్ధాలు..

గత ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాలంటూ ప్రచారం చేసుకున్నారని.. మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాలన్నీ ఏమయ్యాయని రాజన్నదొర ప్రశ్నించారు. 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమన్నారు. రండి.. రండి.. నచ్చిన దగ్గరకు వెళ్లండి అని స్వయంగా చంద్రబాబు చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం జిల్లాకే పరిమితమని మంత్రి సంధ్యారాణి శాసనసభలో ప్రకటించారు. మేనిఫెస్టోలో చెప్పిన దానికి భిన్నంగా మంత్రి మాటలున్నాయి. మహిళలు ఏ మాటలు నమ్మాలి. గత ఆగస్టుకు అమలన్నారు. మళ్లీ ఇప్పుడు ఆగస్టు అంటున్నారు. ఇలా ఎన్ని ఆగస్టులు పోవాల'ని విమర్శించారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనమన్నారు. ఏడాది గడిచినా ఒక్కరికీ ఇవ్వలేదు. ఆడబిడ్డ నిధి కింద రూ.18 వేలు ఇస్తామని చెప్పారు. ఎప్పుడిస్తారో తెలియదు. ఇలా మహిళలకు ఇస్తామన్న ఏ పథకమూ అమలు చేయకుండా మన అక్కాచెల్లెమ్మలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచాడు. గత ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మహిళలకు రూ.18,750 చొప్పున ఇచ్చేవారు. ప్రతి అక్కా ఆలోచించాలి. మీ కోసమే మా నిరసన. ర్యాలీకి తరలివచ్చి మీ గళం వినిపించాలి.' అని రాజన్నదొర పిలుపునిచ్చారు.

ఏడాదిలో యువతకు రూ.36 వేలు బాకీ..

నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పిస్తామన్న చంద్రబాబు ప్రభుత్వం.. వారికి వెన్నుపోటు పొడిచిందని రాజన్నదొర విమర్శించారు. ఉద్యోగాలు ఇవ్వలేని పక్షంలో నెలకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామన్నారని.. ఏడాదవుతున్నా ఒక్క రూపాయి అయినా ఇచ్చారా? అని నిరుద్యోగులను ఉద్దేశించి ప్రశ్నించారు. ఏడాది కాలంలో ఒక్కొక్కరికీ రూ.36 వేలు చొప్పున కూటమి ప్రభుత్వం బకాయి పడిందన్నారు. 'యువతా.. ఆలోచించండి.. ఈ పోరాటం వైఎస్సార్‌సీపీ కోసం కాదు.. మీ కోసం.. మీ గళం వినిపించడానికి.. ఇందులో మీరంతా భాగస్వామ్యం కావాల'ని పిలుపునిచ్చారు.

వీరందరికీ చేసింది వెన్నుపోటు కాదా?

ఎస్సీ, బీసీ, మైనారిటీలకు 50 ఏళ్లు దాటితే పింఛన్ ఇస్తానని చెప్పి చంద్రబాబు మోసగించారని రాజన్నదొర అన్నారు. కనీసం ఆ ఆలోచన కూడా ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం చేయలేదని గుర్తు చేశారు. కొండ మీద ఉన్న గిరిజనులకు కూడా ఎండీయూ వాహనాల ద్వారా తమ ప్రభుత్వంలో రేషన్ సరుకులు అందజేసేవారమని తెలిపారు. ఇప్పుడు ఎండీయూ వ్యవస్థను ఈ ప్రభుత్వం ఎత్తివేసిందన్నారు. వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ ఇస్తామని చేసిన ప్రకటన.. ఎక్కడా అమలు కాలేదన్నారు. వారంతా సుదూరం నడుచుకుంటూ వెళ్లి రేషన్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎండీయూ వాహనాల పట్ల కూటమి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించిందన్నారు. ఎంతో మంది నిరుద్యోగుల ఉపాధితీసేసిందని తెలిపారు. 'వలంటీర్ల లేకుండా పింఛన్ ఇచ్చేస్తున్నామని చెబుతున్నారు. ఈ ప్రభుత్వానికి సిగ్గుందా? వలంటీర్లు ఒక్క సేవకే పరిమితం కాలేదు.. ఇల్లు, రేషన్, ఆధార్, పెన్షన్ ఏది కావాలన్నా.. నీరు లేకపోయినా, శానిటేషన్ బాగోకపోయినా వలంటీర్లకు ప్రజలు చెప్పేవారు. దేశానికే ఈ వ్యవస్థ ఆదర్శంగా నిలిచింది. అటువంటి వలంటీర్లకు వెన్నుపోటు పొడిచారు. మీరు అధికారంలోకి వస్తే వారికి రూ.10 వేలు ఇస్తామని చెప్పడం అబద్ధమా?' అని కూటమి నాయకులను ప్రశ్నించారు. గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలుగా పరిగణిస్తామని, జీఓ 3 అమలు చేస్తామని మాటిచ్చి, ఇప్పుడు దాన్ని నిలబెట్టుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. ఇలా గిరిజనులకూ కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందన్నారు. జగన్ రైతు భరోసా ఇస్తే.. చంద్రబాబు అన్నదాత సుఖీభవ అని మోసగించారని గుర్తు చేశారు. తాము రూ.13,500 రైతుభరోసా కింద ఇస్తే.. కేంద్రం ఇచ్చిన డబ్బులతో కలిపి ఇస్తారా? అని చంద్రబాబు గగ్గోలు పెట్టారని... ఇప్పుడు కేంద్రంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే మొత్తం రూ.20 వేలు ఇవ్వగలదా? అని ప్రశ్నించారు. ఏడాది కాలంలో రైతులకు రూపాయి కూడా ఇవ్వకుండా ఆ వర్గాన్నీ వెన్నుపోటు పొడిచారని తెలిపారు.

దగా పడ్డ ప్రజల కోసమే 'వెన్నుపోటు దినం'

ఇలా అన్ని వర్గాల కోసమే ఈ నిరసన.. వైఎస్సార్‌సీపీ కోసం కాదని రాజన్నదొర అన్నారు. సాలూరులో ఈ నెల 4న చేపట్టబోయే ర్యాలీలో అన్ని వర్గాలూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకే ఈ పోరాటమని స్పష్టం చేశారు.

అరెస్టుల ఆంధ్రాలో.. మాట్లాడితే కేసు!

'రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోంది. ఎవరడిగితే వారిపై కేసు.. ఎవరు మాట్లాడితే వారిపై కేసు. అరెస్టుల ఆంధ్రాగా మార్చేశారు. ఐఏఎస్, ఐపీఎస్‌లపైనా కేసులు పెడుతున్నారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇలా లేదు. ఎక్కడైనా ఐఏఎస్, ఐపీఎస్‌లపై ఇటువంటి అరెస్టులు ఉన్నాయా? అధికారులు ఆలోచించాలి. మాకు రెడ్‌బుక్ లేదు.. కానీ.. మేమూ రాసుకుంటున్నాం. ఏ అధికారి ఎలా వ్యవహరిస్తున్నారో గమనిస్తున్నామ'ని రాజన్నదొర వ్యాఖ్యానించారు. తాను ఏనాడూ పోలీసులపైన, ఇతర అధికారులపైన దురుసుగా వ్యవహరించలేదని, ఏ విషయంలోనూ వారిపై ఒత్తిడి తీసుకురాలేదని గుర్తు చేశారు. 'ఆ రోజు మిమ్మల్ని ఎలా చూసుకున్నామో.. ఈ రోజు మీరు ఎలా పని చేస్తున్నారో ఒకసారి అధికారులంతా ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఇప్పుడున్న గిరిజన శాఖ మంత్రి మీ పట్ల ఎలా వ్యవహరిస్తున్నారు? ఒక్క సాలూరు నియోజకవర్గంలోనే ఎన్నో ఉద్యోగాలు తీసేశారు. సస్పెండ్ చేస్తున్నారు.. బలవంతంగా బదిలీలు చేస్తున్నారు. చివరికి వీఆర్వో, వీఆర్ఏలను కూడా వదలడం లేదు. పాచిపెంట మండలం కేసలి పంచాయతీలోనే పలువురిని విధుల నుంచి తొలగించారు. గతంలో మా ప్రభుత్వానికి, ఇప్పటి ప్రభుత్వానికి తేడా గమనించండి. జగన్ ప్రభుత్వంలో ఉద్యోగులకు మేలే జరిగింది గానీ, కీడు తలపెట్టలేదు. పీఆర్సీ కోసం ప్రత్యేక కమిషన్‌ను జగన్ వేశారు. ఈ ప్రభుత్వం వచ్చి ఏం చేసింది.. ఐఆర్ లేదు. డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. పాత పెన్షన్ విధానం కోసం ఏమైనా మాట్లాడుతున్నారా? బకాయి పడిన డబ్బులిచ్చారా?.. ఇది వెన్నుపోటు కాదా?' అని రాజన్నదొర ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే హత్యలు, అత్యాచారాలు, అక్రమకేసులు అధికమయ్యాయని విమర్శించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో.. ర్యాంకుల పంట

కొమరాడ: ప్రతిష్టాత్మక ఐఐటీ, ఎన్ఐటీ కళాశాలల్లో ఇంజినీరింగ్ ప్రవేశాలకు సంబంధించిన జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఇందులో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. జాతీయ స్థాయిలో వెయ్యిలోపు ర్యాంకులు 9 మంది సాధించారు.

78వ ర్యాంకు సాధించిన రసజ్ఞ



రసజ్ఞకు స్వీట్స్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

వీరఘట్టం/పాలకొండ రూరల్: వీరఘట్టం మండలం పనసనందివాడ (ప్రస్తుతం పాలకొండలో నివాసం) గ్రామానికి చెందిన కొరికాన రసజ్ఞ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో ఓబీసీ కేటగిరీలో 8, జనరల్ విభాగంలో 78వ ర్యాంకు సాధించింది. కుమార్తె ఉత్తమ ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు శ్రీనివాస్, రమణమ్మ మురిసిపోయారు. కుమార్తెకు స్వీట్స్ తినిపించి సంబరాలు చేసుకున్నారు.

భరత్ చంద్రకు 2వ ర్యాంకు



తల్లిదండ్రులతో భరత్‌చంద్ర

కొమరాడ మండలం గుణానపురం గ్రామానికి చెందిన పల్లా భరత్‌చంద్ర జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలల్లో జాతీయ స్థాయిలో ఓబీసీ కేటగిరీలో 2, జనరల్ విభాగంలో 21వ ర్యాంకు సాధించాడు. ఆయన తండ్రి పల్లా రామకృష్ణ విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలో మెరైన్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తుండగా, తల్లి శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

సత్తా చూపిన ఎస్‌ఓఈ విద్యార్థులు



పి.జగదీశ్వరరావు



కె అభిరాం

సీతానగరం: మండలంలోని జోగింపేట గిరిజన స్కూల్‌ఆఫ్ ఎక్స్‌లెన్స్ (ఎస్ఓఇ) విద్యాలయం విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సత్తా చూపారు. పి.జగదీశ్వరరావు ఎస్టీ కేటగిరీలో 1178, కె.అభిరాం 2,116వ ర్యాంక్ సాదించాడు. వీరిని ప్రిన్సిపాల్ బి.ధర్మరాజుతో పాటు సిబ్బంది అభినందించారు.

చాణక్య ప్రతిభ



బోను చాణక్య

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలస గ్రామానికి చెందిన బోను చాణక్య జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఓబీసీ విభాగంలో 78, ఓపెన్ కేటగిరీలో 550వ ర్యాంక్ సాధించాడు. తండ్రి శంకరరావు బలిజిపేట మండలం పెదపెంకి ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తుండగా, తల్లి ప్రియాంక గృహిణి.

పర్యావరణ పరిరక్షణకు కలిసి పనిచేద్దాం

- ప్లాస్టిక్ కవర్లకు బదులు జ్యూట్ లేదా క్లాత్ బ్యాగ్‌లు

పార్వతీపురం టౌన్: పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం (జూన్ 5) సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం క్లాత్‌బ్యాగ్‌లను కలెక్టర్ ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నియంత్రణపై ప్రజలకు అవగాహన అవసరమన్నారు. జూన్ 5న వనం మనం కార్యక్రమంను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జేసీ శోభిక, డీఆర్వో కె.హేమలత, ఇంజినీర్ కరుణశ్రీ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

క్లుప్తంగా

ఇంటిపైకి దూసుకెళ్లిన కారు..

● ముగ్గురికి తీవ్రగాయాలు


సంఘటన స్థలంలో ఇంటిపైకి దూసుకెళ్లిన కారు

విజయనగరం గంటస్తంభం/క్రైమ్: విజయనగరం సన్‌స్కూల్ పక్కన రామకృష్ణ నగర్‌లో నివాసముంటున్న పట్నాన సత్యవతి ఇంటిపైకి డంపింగ్ యార్డు మీదుగా 15 అడుగుల ఎత్తు నుంచి ఓ కారు దూసుకువచ్చింది. ఈ ఘటనలో పట్నాన సత్యవతి(60), గొడ్డు వినయ్(14), పట్నాన వినయ్(12) కారు కింద ఇరుక్కుపోయారు. దీంతో కాలనీ యువకులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని కారును ఎత్తి వారిని బయటకు తీశారు. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం వారు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులను సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరావు, ఎం.శాంతమూర్తి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..అర్ధరాత్రి మద్యం తాగుతూ కారును నడిపిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

హైవోల్టేజ్‌తో కాలిపోయిన టీవీలు


కాలి బూడిదైన ఫ్యాన్లు, టీవీ, ఇతర వస్తువులు

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని జొన్నగుడ్డి రుప్పవీధిలో హైవోల్టేజ్ రావడంతో సోమవారం ఓ ఇంట్లోని ఫ్యాన్లు, టీవీ, కూలర్, లైట్లు కాలిపోయాయి. అలాగే బట్టలతో సహా అన్నీ కాలిపోయాయి. ఇంట్లో ఉన్న వస్తువులన్నీ కాలిపోవడంతో బాధిత కుటుంబం ఆవేదన చెందుతోంది.

25 లీటర్ల సారా పట్టివేత


తహసీల్దార్ కార్యాలయం వద్ద అక్రమ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

సీతంపేట: మండలంలోని కొత్తకోట జంక్షన్ వద్ద 25 లీటర్ల సారా అక్రమరవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు దోనుబాయి ఎస్సై మస్తాన్ తెలిపారు. వీరఘట్టానికి చెందిన శివయ్యను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్..

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది గ్రామం వద్ద వేగావతినదిలో అక్రమంగా ఇసుక తవ్వి తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం ఆర్‌డీఓ జేవీవీఎస్ రామ్మోహనారావు అదుపులోకి తీసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అనుమతులు లేకుండా ఇసుకను తవ్వి తరలిస్తున్నందుకు గాను ట్రాక్టర్ యజమానికి రూ.10వేల జరిమానా విధించామని తహసీల్దార్ ఎం.శ్రీను తెలిపారు.

లారీని ఢీకొని ఇద్దరికి గాయాలు

గుర్ల: మండలంలోని అచ్యుతాపురం వద్ద సోమవారం ఇద్దరు యువకులు గాయపడ్డారు. మెరకముడిదాం మండలంలోని సింగవరం గ్రామానికి చెందిన స్వామి, వాసులు ద్విచక్ర వాహనంపై విజయనగరం వెళ్తుండగా అచ్యుతాపురం వద్ద విజయనగరం నుంచి వస్తున్న లారీని బలంగా ఢీకొట్టడంతో ఇద్దరికీ తలపై గాయాలయ్యా యి. గుర్ల పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం వారిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. గుర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

రెడ్డి ల్యాబ్స్ ఉద్యోగిని ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన భారతి

విజయనగరం క్రైమ్: విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. పడాల పేటలో ఉంటున్న నడిపేన భారతి, పూసపాటిరేగ వద్ద గల రెడ్డి ల్యాబ్స్‌లో పని చేస్తోంది. వృత్తిలో పర్మినెంట్ కాలేదని కొన్ని రోజుల క్రితం ఆమె కన్నతల్లికి చెప్పింది. చేస్తున్న పనిలో ఒత్తిడి కూడా అధికం అవడం, తల్లికి భారమవుతున్నానన్న బాధతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకోవాలని భావించి డ్యూటీ నుంచి రాగానే ఇంట్లోని తన గదిలో తలుపేసుకుని ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఈ మేరకు భారతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210

ప్రజల సమస్యలను పరిష్కరించాలి


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్


సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి


ఫిర్యాదు దారుతో మాట్లాడుతున్న ఏఎస్పీ అంకితా సురానా

పార్వతీపురంటౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ప్రాధాన్యంతో పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ సమావేశమందిరంలో కలెక్టర్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి 63 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోపు అర్జీదారు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, పునఃపరిశీలన లేకుండా సంతృప్తి స్థాయి పెరిగేలా అర్జీలను పరిష్కరించాలని పేర్కొన్నారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని తెలిపారు.

కలెక్టర్‌కు అందిన విజ్ఞప్తులలో కొన్ని..

- ముత్యాల సెంటర్ నుంచి కొత్తం గ్రామం వరకు మెయిన్ రోడ్డు మంజూరు చేయాలని సీతంపేట మండలం కొత్తం గ్రామానికి చెందిన సవర.గంగయ్య అర్జీ అందజేశారు.
- వీరఘట్టం మండలం అడారు గ్రామానికి చెందిన సీహెచ్. దుర్గమ్మ ఐసీడీఎస్ ప్రాజెక్టులో పనిచేస్తూ 2022 జూలైలో పదవీ విరమణ పొందియున్నానని, ప్రభుత్వం నుంచి తనకు రావాల్సిన బెనిఫిట్స్ ఏమీ అందలేదని, బెనిఫిట్స్ మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.
- పార్వతీపురం మండలం గడబవలస గ్రామానికి చెందిన కె. జగన్నాథం జీవన ఉపాధికోసం ట్రాక్టర్ కొనడానికి ప్రభుత్వం రుణం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.
- సాలూరు మండలం మావుడి గ్రామానికి చెందిన సీహెచ్ అశోక్(ఎస్టీ కొండదొర) కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎంవీ కరుణాకర్, జిల్లా ప్రణాళిక అధికారి పీ.వీర్రాజు, డ్వామా పీడీ కె. రామచంద్రరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె. రాబర్ట్ పాల్, ఉద్యానవనశాఖ అధికారి బి.శ్యామల, పశుసంవర్ధక శాఖ అధికారి డా.ఎస్.మన్మథరావు, డీఆర్‌డీఏ ఏపీడీ ఎం.సుధారాణి, ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ, డీఎంహెచ్ఓ డా.ఎస్.భాస్కరరావు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకురాలు ఆర్.కృష్ణవేణి, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు 32 వినతులు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏలో పీఓ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 32 వినతులు వచ్చాయి. జమ్మడుగూడ గ్రామానికి చెందిన సవర కళ్యాణ్ రహదారి మంజూరు చేయాలన్నారు. చిన్నపొల్లకు చెందిన శ్రీలత కుట్టుమిషన్ ఇప్పించాలని కోరారు. మామిడి, జీడి మొక్కలు పంపిణీ చేయాలని కురసింగి గ్రామస్తులు వినతి ఇచ్చారు. కోడిశ గ్రామస్తుడు హెచ్.రవి వన్‌బి అడంగల్ ఇప్పించాలన్నారు. ట్రాక్టర్ లోన్ మంజూరు చేయాలని పద్మాపురం గ్రామస్తుడు మనోసింగు కోరారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు, ఈఈ రమాదేవి, డీడీ అన్నదొర, పీహెచ్‌వో ఎస్.వి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

పార్వతీపురం రూరల్: ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి ఉత్తర్వుల మేరకు పార్వతీపురం ఏఎస్పీ అంకితా సురానా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదు దారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చిన నాలుగు ఫిర్యాదుల్లో కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, అత్తారింటి వేధింపులు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు తదితర సమస్యలపై ఫిర్యాదులు అందినట్లు ఆమె పేర్కొన్నారు. అనంతరం సమస్యలను సంబంధింత పరిధిలో ఉన్న స్టేషన్ అధికారులకు అప్పగించి వాటిని దర్యాప్తు చేసి తక్షణ చర్యలు చేపట్టి జిల్లా పోలీసుశాఖ కార్యాలయానికి నివేదికను పంపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ ఆదాం తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుపోదాం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

● మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతోందని అదేరోజు వెన్నుపోటు దినం పేరుతో జిల్లా కేంద్రంలో, నియోజకవర్గ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడదామని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా సంపూర్ణంగా అమలు చేయకుండా ప్రజలను కూటమి ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం ఆయన తన స్వగృహంలో నియోజకవర్గం పరిధిలో గల వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రతినిదులు, నియోజకవర్గ, రాష్ట్రస్థాయి వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులు, పార్టీ నేతలతో కలిసి 'వెన్నుపోటు దినం' పోస్టర్‌ను ఆవిష్కరించారు. వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో పార్టీ శ్రేణులతో పాటు మోసపోయిన ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌చైర్మన్ యిండుపూరు గుణేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ షఫీ, బీసీ సెల్ అధ్యక్షుడు గొర్లి మాధవరావు, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలి

సీతానగరం: రాష్ట్రంలో 2024 సాధారణ ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి గెలిచిన తర్వాత పథకాలను అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వ మోసపూరిత విధానానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు సీతానగరం మండల వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఆవరణలో కార్యకర్తలు, మండల జిల్లా స్థాయి నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి. శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ బాబ్జీ, మాజీ జెడ్పీటీసీ డాక్టర్ కృష్ణంనాయుడు, జిల్లా పార్టీ నాయకులు ఆర్వీ పార్థసారథి, పోల ఈశ్వరనారాయణ, బి.శివకుమార్, బి శంకరరావు, ముకుందరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రవిచంద్ర

కూటమి ప్రభుత్వ మోసాలపై వెన్నుపోటు దినం

పార్వతీపురం టౌన్: ఏడాది పాలన కాలంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వంచిస్తున్న కూటమి ప్రభుత్వ అరాచకాలపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు జూన్ 4 న జరగనున్న వెన్నుపోటు దినం కార్యక్రమంలో వేలాదిమంది పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. పోస్టర్ ఆవిష్కరణలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సర్వేశెట్టి శ్రీనివాసరావు, ఎంప్లాయీస్, పెన్షనర్స్ రాష్ట్ర కార్యదర్శి కె. ప్రకాష్, క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్.వర ప్రసాద్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ షఫీ, రాష్ట్ర ఆర్టీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవుపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామస్థాయి యోగా శిక్షణ

● జాయింట్ కలెక్టర్ డాక్టర్ సేతు మాధవన్


మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్

విజయనగరం అర్బన్: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయి యోగా శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమవుతుందని దీనికి ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్, యోగాంధ్ర నోడల్ అధికారి ఎస్.సేతుమాధవన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం జిల్లా అధికారులకు జేసీ పలు సూచనలు చేశారు. ప్రతి సచివాలయానికి 9 మంది యోగా శిక్షకులను ఎంపిక చేశామని, వారి ద్వారా 3వ తేదీ నుంచి ఒక్కో బ్యాచ్‌కు 70 మంది చొప్పున 3 రోజుల యోగా శిక్షణ ప్రారంభిస్తామని తెలిపారు. దీని కోసం ఎంపిక ఎంపిక చేసిన ప్రదేశాలను వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఐదు రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న వారిని మాత్రమే యోగా శిక్షకులుగా ఎంపిక చేసినట్లు స్పష్టం చేశారు. ఇలా జూన్ 14 వరకు బ్యాచ్‌ల వారీగా శిక్షణ జరుగుతుందని గ్రామంలోని దాదాపు అందరికీ యోగా శిక్షణ ఇచ్చేందుకు కృషి చేయాలని కోరారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి


చినమరికి గదబవలస మధ్యలో ఉన్న మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం, (ఇన్‌సెట్లో) మృతుడు చెట్లా సింహాచలం (ఫైల్)

పార్వతీపురం రూరల్: మండలంలోని చిన్నమరికి గదబవలస గ్రామాల మధ్యలో ఉన్న మలుపు వద్ద సోమవారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో జియ్యమ్మవలస మండలం బసంగి గదబవలసకు చెందిన చాట్ల సింహాచలం (33) మృతి చెందినట్లు పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

పెళ్లి పనుల నిమిత్తం వెళ్లి..

మృతుడిని జియ్యమ్మవలస మండలం బసంగి గదబవలసకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. గరుగుబిల్లి మండలం తోటపల్లి జలాశయం సమీపంలో ఉన్న ఐటీడీఏ పార్కులో నిర్వహణ పనుల సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడి అత్తవారు పార్వతీపురం మండలంలోని కొత్తూరు కావడంతో బుధవారం జరగనున్న తన బావమరిది పెళ్లి పనుల నిమిత్తం వెళ్లి తిరుగు ప్రయాణంలో మామతో కలిసి వస్తుండగా ప్రమాదం జరిగింది. మృతుడికి మూడేళ్ల అబ్బాయి ఉండగా భార్య గర్భిణి కావడంతో డెలివరీ నిమిత్తం కన్నవారింట్లో ఉంది. కుటుంబ పోషణకు పెద్ద దిక్కుగా ఉన్న యజమాని మరణంతో అత్తవారింట, కన్నవారింట విషాదఛాయలు అలుముకున్నాయి.

బండెమ్మ తల్లి హుండీల చోరీ


బండెమ్మ ఆలయంలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్ సభ్యులు

శృంగవరపుకోట: పద్నాలుగు ఏళ్ల తర్వాత ఎస్.కోట మండలంలోని సీతంపేట గ్రామంలో వేడుకగా జరిగిన జరిగిన బండెమ్మ తల్లి పండగ భక్తుల్లో కొత్త ఉత్సాహం నింపినా, వారి మనోభావాల్ని మాత్రం దొంగలు దెబ్బకొట్టారు. ఆదివారం రాత్రి అమ్మవారి అనుపోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రాత్రి 12గంటల వరకూ అమ్మవారి ఆలయం వద్ద సందడిగానే ఉంది. రాత్రి 12గంటల సమయంలో అనువంశిక అర్చకులు, పెద్దలు అమ్మవారికి చెల్లించాల్సిన కానుకలు, ముడుపులు చెల్లించి ఇళ్లకు వెళ్లారు. అమ్మవారి ఆలయం వద్ద సందడి సద్దుమణగగానే దొంగలు పక్కాగా ప్లాన్ అమలు చేశారు. రాత్రి 12గంటల తర్వాత ఆలయంలో ఉన్న స్టీల్, ఐరన్ హుండీలను ఎత్తుకుపోయారు. స్టీల్ హుండీ పగలగొట్టి పక్కన ఉన్న పశువుల పాకలో పడేశారు. ఇనుప హుండీని మాత్రం పట్టుకుపోయారు. 14 ఏళ్ల తర్వాత పండుగ జరగడంతో అమ్మవారికి ఆదాయం దండిగానే వచ్చింది. సుమారు లక్ష రూపాయలు చోరీకి గురైఉంటాయని గ్రామ పెద్దలు చెబుతున్నారు. చోరీ విషయం తెలుసుకున్న ఎస్.కోట పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామంటూ ఎస్.కోట పోలీసులు చెబుతున్నారు.

ముమ్మరంగా మొక్కజొన్నలు విత్తుతున్న రైతులు


దుక్కుదున్నుతూ మొక్కజొన్నలు విత్తుతున్న రైతులు

సాలూరు రూరల్: మండలంలోని రైతులు మొక్కజొన్న విత్తనాలు జూన్ మొదటి వారంలోనే నాటుతున్నారు. తొలకరి జల్లులు తొందరగా పలకరించడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. తొందరగా విత్తులు నాటితే తొందరగా పంట చేతికి వస్తుందన్న ఆశతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇది ఇలా ఉండగా గత ఏడాది ఇలాగే జూన్ తొలి వారంలో ఉడిచిన మొక్కజొన్నలు వర్షాలు లేక ఎండిపోయి చాలావరకు రైతులు మలి విడత విత్తనాలు వేసుకోవాల్సి వచ్చింది. అప్పట్లో శివరాంపురం గ్రామంలో రైతులు పంట నష్టపోవడంతో వ్యవసాయ అధికారులు మొక్కజొన్నలు జూన్ మూడవ వారంలో నాటాలని రైతులకు సూచించారు. అలా అయితే చీడపీడలు కూడా తక్కువగా ఆశిస్తాయని రైతులకు చెప్పారు. అయితే ఈ ఏడాది రైతులకు ఈ విషయంలో సచివాలయ సిబ్బంది కానీ వ్యవసాయ అధికారులు కానీ రైతులకు తగు సూచనలు సలహాలు ఇవ్వకపోవడంతో రైతులు అదును పోతుందేమోనన్న తొందరపాటులో చిన్నచిన్న పొరపాట్లు చేస్తున్నారు. ఈ విషయంలో రైతులకు తగు జాగ్రత్తలు వ్యవసాయ అధికారులు సూచించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

అల్లంత దూరాన..!

చద్దన్నం కంటే ఊరగాయ రుచే ఎక్కువైందని వాపోతున్నారు గిరిజనం. ప్రభుత్వం ఫ్రీగా రేషన్ బియ్యం ఇస్తున్నా వాటిని ఇంటికి చేర్చాలంటే కనీసం రూ.100 ఖర్చు పెట్టాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో ఇంటింటికీ రేషన్ అందించి మేలు చేశారని, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో మళ్లీ పాత కష్టాలు పరిచయం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ సరుకుల కోసం 20 నుంచి 40 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయక తప్పదని ఒక రోజంతా పని మానుకోవాల్సి వస్తోందని ఆవేదన వెళ్లగక్కుతున్నారు. రేషన్ సరుకులు పొందడానికి గిరిజనులు పడుతున్న కష్టాలకు అక్షర రూపం.

- రేషన్ బియ్యం ఫ్రీ అయినా..
- ఇంటికి చేర్చేందుకు రూ.100 ఖర్చు
- సరుకులు కావాలంటే 20-25 కిలోమీటర్ల ప్రయాణం
- అష్టకష్టాలు పడుతున్న గిరిజనులు


ఆటోలో సరుకులు తీసుకు వెళ్తున్న గిరిజనులు


దిగువ మెండంగి డిపోలో రేషన్ కోసం క్యూలో ఉన్న గిరిజన మహిళలు


దిగువ మెండంగిలో రేషన్ సరుకులు కోసం వెళ్తున్న గిరిజనులు

సాలూరు రూరల్: మండలంలోని దిగువ మెండంగి డిపోలో రేషన్ సరుకుల కోసం డొంకల వెలగవలస, పనసలవలస తదితర గ్రామాల ప్రజలు సోమవారం ఆటోలో వచ్చి సరుకులు తీసుకున్నారు. ఈ సరుకులు తీసుకుని వారి గ్రామానికి చేరాలంటే రూ.100 ఆటో చార్జీ వెచ్చించాల్సిందేనని గిరిజన మహిళలు వాపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చేది ఫ్రీ బియ్యమే కానీ అవి ఇంటికి చేరాలంటే మాకు వందరూపాయలు ఖర్చు అవుతోందని గిరిజన మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన రెడ్డి ఇంటింటికీ రేషన్ సరుకులు అందించి పేదలకు ఎంతో మేలు చేశారని ఇంటివద్దే సరుకులు తీసుకుని ప్రశాంతంగా ఉండేవారమని చెబుతున్నారు. కానీ ఇప్పుడు పాత పద్ధతిలోనే రేషన్ సరుకుల కోసం ఒక రోజంతా సమయం కేటాయించడంతో పాటు ప్రయాణానికి చార్జీల రూపంలో ఖర్చులు పెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను కనుమరుగు చేసే క్రమంలో ఇంటింటికీ రేషన్ ఇచ్చే వాహనాలతో పాటు ఎండీయూ ఆపరేటర్లను తొలగించడంపై మండిపడుతున్నారు. ఈ క్రమంలో ఇంటింటి రేషన్ పంపిణీ నిలిపివేయడంతో ఏజెన్సీలోని గిరిశిఖర గ్రామాల ప్రజలు డిపోల నుంచి రేషన్ తెచ్చుకోవాలంటే 20-25 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల నుంచి ఇంటింటికీ రేషన్ పంపిణీతో ఎంతో మేలు జరిగిందనుకున్న తరుణంలో మళ్లీ కూటమి ప్రభుత్వం పాత పద్ధతినే రేషన్ డిపోలో క్యూలో నిలబడి రేషన్ సరుకులు అందుకునే విధంగా చర్యలు తీసుకోవడంపై ముఖ్యంగా గిరిజనులు వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తోంది. కొదమ పంచాయతీలోని 13 గ్రామాల ప్రజలు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న నంద గ్రామంలో రేషన్ సరుకులు తీసుకోవాల్సి వస్తోంది. కొఠియా, గంజాయిభద్ర పంచాయతీల ప్రజలు నేరెళ్ల వలస డిపోకు 15 కిలోమీటర్లు కొండ దిగి వస్తున్నారు. అలాగే డెన్సరాయి సంపంగిపాడు పంచాయతీలకు చెందిన 10 గ్రామాల ప్రజలు కురుకుట్టి రేషన్ డిపోకు చేరుకోడానికి 10 కిలోమీటర్లు నడవాల్సి వస్తోంది. జిల్లేడు వలస పంచాయతీ ప్రజలు దండిగాం డిపోకు 20 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. కరడవలస పంచాయతీ గిరిజనులు ఏకంగా 40 కిలోమీటర్లు ప్రయాణించడంతో పాటు రెండు వైపులా రూ.300 చార్జీలు రూపంలో వెచ్చించాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా సాలూరు మండలంలోని గిరిశిఖర గ్రామాల ప్రజలకు డిపోలలో సరుకులు తీసుకోవాలంటే ఇబ్బందికరంగా ఉంటుందని చెబుతున్నారు.

ఏజెన్సీ వాసులకు మళ్లీ పాతకష్టాలే



మండలంలోని ఏజెన్సీ వాసులకు ఎండీయూ వాహనాల రద్దుతో మళ్లీ రేషన్ తీసుకోడానికి డిపోలకు వెళ్లాలంటే డబ్బుల ఖర్చుతో పాటు రోజంతా సమయం వెచ్చించాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల నుంచి గిరిజనులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం వారిని మరిన్ని ఇబ్బందులకు గురిచేయడం మంచిది కాదు. ఇంటింటికీ రేషన్ సరుకులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలి.

ఎం.బీసు గంజాయిభద్ర గ్రామం

యోగాంధ్ర అర్బన్ లెవెల్ పోటీలు


పోటీల్లో భాగంగా యోగాసనాలు వేస్తున్న బాలలు

విజయనగరం: అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర 2025 అర్బన్ స్థాయి పోటీలను విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు సోమవారం ప్రారంభించారు. ఈ మేరకు స్థానిక రాజీవ్ స్టేడియంలో యోగాసనాలు, సూర్యనమస్కారాలు, ప్రాణాయామం, మెడిటేషన్‌కు సంబంధించి 10 నుంచి 18 సంవత్సరాలలోపు బాలబాలికలకు అర్బన్ స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు ఈనెల రెండో తేదీ నుంచి ఏడో తేదీ వరకు జరుగుతాయని పేర్కొన్నారు. అర్బన్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి జిల్లా స్థాయి పోటీలకు అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు, పీడీలు, పీఈటీలు, యోగా శిక్షకులు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

375 గ్రాముల గంజాయి స్వాధీనం

● ఇద్దరి అరెస్ట్


గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్న వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, సిబ్బంది

విజయనగరం క్రైమ్: విజయనగరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు గంజాయి విక్రయదారులను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని పెద్ద చెరువు రామానాయుడు రోడ్డులో కొంతమంది వ్యక్తులు గంజాయి పీలుస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఈ దాడిలో ఉడాకాలనీకి చెందిన వజ్జల భరత్ కుమార్, లంకాపట్నానికి చెందిన చిన్న మనోహర్‌లు గంజాయి పీలుస్తూ, విక్రయాలకు పాల్పడుతుండగా పట్టుకున్నారు.వారి దగ్గర నుంచి 375 గ్రాముల గంజాయి, రూ.350 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. గంజాయిని చిన్న మొత్తాల్లో విక్రయిస్తున్నట్లు నిందితులు విచారణలో అంగీకరించారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాస్ చెప్పారు.